నాసిరకం వస్తువుల సరఫరాపై చర్యలు తీసుకోవాలి

- అంగన్‌వాడీలకు ఒకే యాప్ ప్రారంభించాలి
- రేపు సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నాలు
- యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం పప్పు, చిక్కీలు, గుడ్లు ఇతర వస్తువులు సరఫరా చేస్తున్న డీలర్లు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, ఎఫ్ ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం జిల్లా పీడీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లకు నాణ్యమైన సరుకులు కాకుండా నాసిరకం ఇచ్చి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. అలాంటి వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీల వద్ద ముందే వేలిముద్రలు చేసుకుని రెండు, మూడు రోజుల తర్వాత సరుకులు సరఫరా చేస్తున్నారన్నారు. ఈ కారణంగా సరుకులు ఇచ్చేవి నాసిరకమైనవని గుర్తించలేకపోతున్నారని పేర్కొన్నారు. వారు సరఫరా చేసిన తర్వాతే నాసిరకం అని తెలుస్తున్నా యన్నారు. వాటిని తిరిగి మార్చి ఇవ్వాలని వారిని ప్రశ్నిస్తే తిరిగి ఇవ్వకుండా 'మీ వల్ల అయింది మీరు చేసుకోండి..!' అని బెదిరిస్తున్నారని తెలిపారు. నాసిరకమైన వాటిని లబ్ధిదారులకు ఎలా ఇవ్వాలని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల యాప్‌లు తెచ్చి అంగన్‌వాడీలపై పనిభారం పెంచుతోందని ఎఫ్ఆర్ఎస్ వల్ల అంగన్‌వాడీ సిబ్బందే కాకుండా లబ్ధిదారులూ వారి పనులు పోగొట్టుకొని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పది సంవత్సరాల అవుతున్నాయని ప్రస్తుత స్పీడు నెట్‌వర్కులో అవి ఎలా పనిచేస్తాయని ప్రశ్నించారు. 5జి సిమ్ కార్డులు ఇచ్చి వెంటనే ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం లక్ష్యం నెరవేరాలంటే అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తే లక్ష్యం నెరవేరుతుందన్నారు.

ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందిస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

అధికారులు ప్రతిదానికీ అంగన్‌వాడీలపై విమర్శలు కాకుండా తప్పు ఎక్కడ వుందో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో వెంటనే సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం ఆయన సందర్భంగా సుపరిపాలన అని చెప్పి ఇంటింటికి ప్రచారం చేస్తోందే తప్ప ఇంటింటికీ సేవలందిస్తున్న అంగన్‌వాడీల సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 21వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సిడిపిఓ కార్యాలయాల వద్ద నిర్వహించే నిరసనలో భాగంగా చిత్తూరు జిల్లాలోనూ అంగన్‌వాడీలు అన్ని ప్రాజెక్టుల్లో లబ్ధిదారులను తీసుకెళ్లి సీడీపీవో కార్యాలయంలో వినతి పత్రాలు ఇవ్వాలని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

'స్వచ్ఛాంధ్ర'తోనే 'స్వర్ణాంధ్ర'

పారిశుధ్య కార్మికులే సమాజ సేవకులు

'ప్రజావేదిక' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

'స్వర్ణాంధ్ర కావాలంటే స్వచ్ఛాంధ్రను సాధించాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు. ఇల్లు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య కార్మికులే నిజమైన సమాజ సేవకులని, కేన్సర్ కారకం ప్లాస్టిక్ మాత్రమేనని, దశల వారీగా వాడకాన్ని తగిస్తామని అన్నా రు. మూడో శనివారం 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా తిరుపతికి విచ్చేసిన చంద్రబాబు అలిపిరిలో కంచిమఠం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై, ఎంఆర్‌పల్లి లోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభలో మాట్లాడారు. తొలుత తూకివాకంలోని సమీకృత వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలించానని, అనంతరం కపిలతీర్థంలో కపిలేశ్వర స్వామిని దర్శించుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని అన్నారు. రాష్ట్రం అంతా పరిశుభ్రంగా ఉండాలనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మూడో శనివారం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పాఠశాలలను, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. చెట్లు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కడ చెత్త కనిపించినా దాన్ని తీసుకెళ్లి చెత్తబుట్టలో వేయగలిగితే పరిసరాలు శుభ్రంగా ఉంటా యన్నారు. పారిశుధ్య కార్మికులే నిజమైన సమాజ సేవకులని వారిని అభినందించారు. ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేయాలని, లేదంటే కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్ర సచివాలయంలోనూ, అక్టోబర్ 2 నాటికి 17 కార్పొరేషన్లలోనూ ప్లాస్టిక్ లేకుండా చూస్తాం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తామన్నారు. తిరుపతి లాంటి అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తిరుపతి భారత దేశా నికే ఆదర్శం కావాలన్నారు. బాధ్యతగల పౌరులు రోడ్లపై చెత్త వేయరాదని విజ్ఞప్తి చేశారు. 123 మున్సిపాలిటీల నుంచి 9వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని, తడిచెత్త 5,500 మెట్రిక్ టన్నులు, పొడిచెత్త 3,500 మెట్రిక్ టన్నులు వస్తోందన్నారు. గత ప్రభుత్వం 86 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రోడ్డుపై వదిలేసి వెళ్లిందని, అక్టోబర్ 2 నాటికి గత ప్రభుత్వం వదిలేసి వెళ్లిన చెత్తనూ తొలగిస్తామన్నారు. ఇటీవల వచ్చిన 20 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తనూ డిసెంబర్ నాటికి తొలగించి రోడ్డుపై చెత్త లేకుండా చూస్తామన్నారు. త్వరలోనే ప్రాజెక్టులను పూర్తిచేసి హంద్రీనీవా నీటిని వెంకన్న చెంతకు తీసుకొస్తామన్నారు. మల్లెమడుగు, సోమశిల, స్వర్ణముఖి లింక్ కెనాల్ తీసుకొచ్చి బాలాజీ రిజర్వాయర్‌కు కలుపుతాం. వీటిమధ్యలో వేణుగోపాల సాగర్ వస్తుంది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి తాను పుట్టిన చిత్తూరు జిల్లా రుణం తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, జేసి శుభం బన్సల్,ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

తూకివాకం వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రంను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపు నిచ్చారు. శనివారం చిత్తూరు కలెక్టరేట్ ఆవరణ లో 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'లో భాగంగా 'స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన' పై నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటూ డిఆర్‌ఓ మోహన్ కుమార్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్లాస్టిక్ ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. దీన్ని నిర్మూలించాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వాడడం ఆపి జ్యూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ప్లాస్టిక్ నిర్మూలన - జ్యూట్ బ్యాగుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రేపు సబ్ జూనియర్ స్టేట్ ఫారా అథెంటిక్ ఛాంపియన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

ఈనెల 21న ఫారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరవ జూనియర్, సబ్ జూనియర్ స్టేట్ ఫారా అథెంటిక్ ఛాంపియన్ 2025 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు టి మోహన్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం చిత్తూరు నగరం లోని మెకానికల్ గ్రౌండ్‌లో ఈనెల 21వ తేదీన ఉదయం 9 గంటలకు ఫారా స్పోర్ట్ అసోసియేషన్ ఆఫ్ చిత్తూరు ఆధ్వర్యంలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ అధికారి వినోద్, డిఎస్‌డిఓ బాలాజీ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని విభిన్న ప్రతిబావంతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు లెక్చరర్ పోస్టుల పోటీ పరీక్షలు

- పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా రెవెన్యూ అధికారి కె మోహన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఈ నెల 20 వ తేదీ ఆదివారం నిర్వహించనున్న ఏపీపీఎస్‌సి లెక్చరర్ల పోటీ పరీక్ష- 2025 నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి కె మోహన్ కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని డిఆర్‌ఓ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్‌సి ప్రతినిధి చంద్రారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ ఈ పరీక్ష జూనియర్ కళాశాల లెక్చరర్ పోస్టులకు, డిగ్రీ కళాశాల లెక్చరర్ పోస్టులకు, పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆన్‌లైను పద్ధతిలో పరీక్షలు నిర్వహించ డానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. ఈ పరీక్షల్లో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్షల కేంద్రాల అభ్యర్థుల హాజరు కావాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 4 పరీక్ష కేంద్రాలలో 660 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్ లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు, ఆర్‌టిసి బస్సు సౌకర్యం, విద్యుత్ అంత రాయం లేకుండా సంబంధిత శాఖల అధికారులు చూడాలని, తాగు నీరు, టాయిలెట్స్ సౌకర్యాలు సక్రమంగా ఉండాలని సూచిం చారు. అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరు కునే విధంగా ఆర్‌టిసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

పరీక్షల ఏర్పాట్లపై చర్చిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి కె మోహన్

పరీక్షా కేంద్రముల వివరాలు: శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ స్టడీస్ మురుకంబట్టు, బెంగళూరు టు తిరుపతి బైపాస్ రోడ్డులో వుంది. వంద మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆర్‌విఎస్ నగర్ తిరుపతి రోడ్డు , చిత్తూరు లో వున్న కేంద్రానికి 120 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. మదర్ థెరిసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పలమనేరు రోడ్డు చిత్తూరులో 240 మంది అభ్యర్థులు, వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , తిరుపతి హైవే చిత్తూరు రోడ్డులో వున్న కేంద్రానికి 200 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఈ నెల 20వ తేదీ తేదీన మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5 గంటల వరకు కంప్యూటర్ బేసిక్ ఆన్‌లైను పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఎక్కడ ఎలాంటి పొరబాట్లు లేకుండా జాగ్రత్తగా విధులను నిర్వర్తించాలని అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాలుగు కళాశాలకు సంబంధించిన లైసెన్ ఆఫీసర్లు, పోలీసు, ట్రాన్స్‌కో, మెడికల్ అండ్ హెల్త్, ఏపీఎస్ఆర్టీసీ, డిప్యూటీ తహాశీల్దార్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 'భూ సమస్య తీర్చండి మహాప్రభో ..!' అంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అయినా, ప్రజా ప్రతినిధులు పర్యటన కార్యక్రమం అయినా చేతిలో అర్జీలతో 'అయ్యా మా భూ సమస్య పరిష్కరించండయ్యా..!' అంటూ రెవెన్యూ సమస్యలతో బాధపడుతున్న వారు దర్శనమిస్తుంటారు. జిల్లాలో పెన్షన్, రేషన్ కార్డులు, పక్కా గృహాల సమస్య కాస్తంత తీరినా రెవెన్యూ సమస్యలు మాత్రం పేరుకుపోయాయి. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 75 శాతానికి పైగా ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు భూ సమస్యలే కావడం చూస్తే జిల్లాలో భూ సమస్యలు ఏ మేరకు వున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఏండ్ల నాటి భూ సమస్యను పరిష్కరిస్తాం..' అంటూ సమగ్ర భూ సర్వే, వెబ్‌ల్యాండ్ ఇలా పేర్లు ఏవైనా ..భూ సమస్యలు మాత్రం పరిష్కరించలేకపోయారనేది అక్షర సత్యం. మరో వైపు పేదలు, గిరిజనులు, అణ గారిన వర్గాల ఆధీనంలో ఉన్న భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఏళ్ల తరబడి సాగులో భూములను సైతం వదలడం లేదు.... ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. భూ బకాసురులు కబ్జా చేసేస్తున్నారు.

ఇటీవల రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలోని లెనిన్ నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో సర్వే నెంబర్ 113లో ఒకటిన్నర ఎకరం కోట్ల విలువచేసే భూమిలో వెంచర్ వేసి అమ్మేశారు. ఈ విషయాన్ని స్వయంగా కలెక్టర్ నగర కమిషనర్‌ను ఆదేశించడంతో ఆగమేఘాలపై నగర పాలక యంత్రాగం మున్సిపల్ భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేశారు. ఇదే తరహాలో నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ, మున్సిపల్ భూములు కబ్జాకు గురయ్యాయి. ప్రభుత్వ యాత్రంగం దృష్టి సారించి ప్రభుత్వ భూములు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని బంగారుపాళ్యం మొగిలికి చెందిన గిరిజనులు కోరతున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం, చేతివాటం వల్ల రెవెన్యూ సమస్యలు రోజురోజుకూ పెరుతున్నాయే తప్ప తగ్గడం లేదు. రెవెన్యూ లెక్కల్లో తేడాలు, వన్‌బిలో మార్పులు ఇలా తప్పుల తడకగా రెవెన్యూ లెక్కలుంటున్నాయి. రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తే తప్ప రెవెన్యూ సమస్యలు పరిష్కారం అయ్యేలాలేవు... ఇప్పటికైనా ప్రభుత్వం రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని బాధితులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులు

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్ట్

1300 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

ముందస్తు అందిన సమా చారం మేరకు చిత్తూరు టు టౌన్ పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుండి 1300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ఎస్‌పి మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారి సాయినాథ్ పర్యవేక్షణలో చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నెట్టికంటయ్య, ఎస్ఐ రమేష్ బాబు సిబ్బంది చిత్తూరు పట్టణంలోని చిత్తూరు టౌన్ పరిధిలోని కైలాసపురం శ్మశానం వద్ద శనివారం దాడులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా గంజాయి అక్రమంగా విక్రయిస్తున్న తులసి, జోనష్, శివ, నందకుమార్, హరీష్ అలియాస్ సాములను అరెస్ట్ చేసి వారి వద్ద 1300 గ్రాముల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని టూటౌన్ సిఐ నెట్టికంటయ్య తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న రాజా కోసం గాలిస్తున్నామని తెలిపారు.

అకౌంటు ప్రారంభించాలన్నా కష్టాలే!

- పట్టించుకోని పోస్టాఫీసు సిబ్బంది
- దిక్కుతోచని అమ్మఒడి లబ్ధిదారులు

అమ్మ ఒడి పథకానికి పోస్ట్ ఆఫీస్‌లో అకౌంట్ ప్రారంభించాలని ప్రాధేయపడుతున్నా పోస్టాఫీసు సిబ్బంది పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులకు దిక్కుతోచని స్థితి ఏర్పడింది. తమకు అమ్మ ఒడి జమ కాదేమోనని విద్యార్థిని విద్యార్థుల తల్లులు తల్లడిల్లుతున్నారు.

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండలంలోని విద్యార్థిని విద్యార్థులు అమ్మ ఒడి పథకానికి పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో అకౌంట్ ప్రారంభించేందుకు వెళ్లగా పోస్టుమాస్టరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. విద్యార్థినివిద్యార్థులు అమ్మవారి కోసం పోస్ట్ ఆఫీసులో అకౌంట్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ప్రకటనలో తెలపడంతో అకౌంట్ ప్రారంభిస్తామని మండల కేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీసుకి విద్యార్థినివిద్యార్థులు వెళ్లగా డివైజర్ లేదనే సాకుతో అకౌంట్ ప్రారంభానికి నిరాకరిస్తున్నారు. ఈ విషయమై పోస్ట్ మ్యాన్‌ను విచారణ కోరగా ఇక్కడి నుండి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్కనపల్లి, కడపనతం సబ్ పోస్ట్ ఆఫీస్‌లో చేస్తున్నారు. అక్కడికి వెళ్లి చేసుకోండి అని వారు తెలిపారన్నారు. విద్యార్థిని విద్యార్థులు అంత దూరం వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న పని అని, ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక ఆటోలో వెళ్లాలంటే బాడుగ రూ.150 ఇవ్వాల్సిందే.. కడపనతం సబ్ పోస్ట్ ఆఫీస్‌కి వెళ్లినా నెట్‌వర్క్ పనిచేయక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనిపై చిత్తూరు హెడ్ పోస్ట్ ఆఫీస్ అధికారులు చర్య తీసుకుని విద్యార్థినివిద్యార్థులకు అకౌంటు ప్రారంభిం చేందుకు మండల పోస్ట్ ఆఫీస్‌కు ఆదేశాలు ఇవ్వాలని విద్యార్థిని విద్యార్థులు కోరుతున్నారు. అలా లేకుంటే అమ్మ ఒడి తమకు రాదేమోనని పోస్ట్ ఆఫీసుల చుట్టూ పదేపదే వారం పది రోజులుగా తిరిగినా ఫలితం లేకపోయిందని వారు వాపోతున్నారు. తమకు ఇక అమ్మఒడి రాదేమోనని విద్యార్థిని విద్యార్థులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



వాటర్ ట్యాంకులు శుభ్రంగా ఉంచుకోవాలి

ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటరమణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పాఠశాలల్లో వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా వుంచుకోవాలని ఎస్-ఎస్ఏ అడిషినల్ కోఆర్డినేటర్ వెంకటరమణ అధికారులను ఆదేశించారు. స్థానిక సమగ్రశిక్ష అభియాన్ కార్యాలయంలో జిల్లా 8 కెజిబివిల ప్రిన్సిపాల్స్‌తో అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటరమణ అడ్మిషన్స్, విజయపథం కార్యక్రమం, విద్యాశక్తి రెమిడియల్ తరగతులు, కాల నిర్ణయ పట్టిక, సివిల్ వర్క్స్, వాటర్ ట్యాంక్ క్లీనింగ్, గ్రీన్ పాస్ పోర్ట్స్, రికార్డ్స్ అంశాలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి తరగతిలో పరీక్షల్లో మొదటి, రెండు, ముడవ ర్యాంకు వచ్చిన వారి ఫొటోను ఆ తరగతిలో అంటించలేదు. ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ తరగతులలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

సమీక్షిస్తున్న ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటరమణ

శిథిలావస్థలో తహాశీల్దారు కార్యాలయం

- భయాందోళనతో విధులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం తహాశీల్దారు వారి కార్యాలయంపై అంతస్థు మెట్లు పైకప్పు పూర్తిగా శిథిలా వస్థకు చేరుకున్నాయి. దీంతో తహాశీల్దారు కార్యా లయానికి వచ్చే అర్జీదారులు రైతులు, సిబ్బంది ఎప్పుడు కూలిపోయి మీద పడుతుందోనని భయాందోళనతో విధులు నిర్వహి స్తున్నామని సిబ్బంది వాపోతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం పాతపడి పై పెచ్చులు వూడి పడుతున్నాయని, వెంటనే కొత్త భవనాన్ని నిర్మించాలని కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు. బిక్కుబిక్కుమని విధులు నిర్వహించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తహాశీల్దా రు కార్యాలయ భవనానికి వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు నివేదికలు పంపామని అప్పట్లో నిర్మించిన కాంట్రాక్టర్ల నిర్వాకంతో నాణ్యత పూర్తిగా లోపించి కూలిపోయే దశకు చేరుకుందని రెవెన్యూ అధికారులు అంటున్నారు. పై స్థాయి అధికారులు వెంటనే స్పందించి నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న తహాశీల్దారు కార్యాలయ భవనం

వర్షం..హర్షం..!

- మూడు రోజులుగా మండలంలో వర్షాలు
- రైతుల్లో చిగురించిన ఆశలు
- ఆందోళన కలిగిస్తున్న ఎరువుల కొరత

ప్రజాశక్తి- పలమనేరు రూరల్(గంగవరం): ఎప్పుడెప్పుడు వర్షం పడుతుందా? అని ఎదురుచూస్తున్న రైతులకు వర్షం ఆనందం నింపింది. పలమనేరు రూరల్ పరిధిలో మూడు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో రైతులు వరి నాట్లు వేసుకునేందుకు పొలాలను దుక్కిదున్నుతున్నారు. చినుకు లేక ఆవిరవుతున్న రైతుల ఆశలను వర్షం చిగురింప చేసింది. అయితే పంటలకు వేసే యూరియా, డిఎపి ఎరువులు కొరత రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

వర్షం..హర్షం..

పలమనేరు రూరల్ మండల పరిధిలో మూడు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వరి రైతుల ఆశలు చిగురించాయి. మూడు నెలలుగా వర్షం లేకపోవడంతో ఒక్కరు కూడా వేరుశనగ విత్తనాలు వేయక నిరాశ చెందారు. వేరుశనగ పంట వేసేందుకు సిద్ధంగా వుంచిన విత్తనాలను పిండి వంటలకు , వంటనూనెకు వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వరి పంట వేసేందుకు ఎదురుచూసిన రైతులకు చినుకు జాడ లేకపోవడంతో ఆందోళనతో నిరీక్షించారు. ప్రస్తుతం వర్షం పడటంతో వేరుశనగ, వరి పంటలకు అదునుగా ఉన్న భూములను దుక్కి దున్నడంలో నిమగ్నమయ్యారు.

రైతుల్లో చిగురించిన ఆశలు

రైతులకు వర్షం పడటంతో కనీసం వరి సాగైనా చేసుకోవచ్చని వరి నారులు తయారు చేయడానికి దుక్కిలు దున్నుకుంటున్నారు. పొలాలలో నిలిచిన నీటితోనే చదును చేసుకుంటున్నారు. గతంలో సగభాగమున్న కుంటలు పూర్తిగా నీటితో నిండిపోయాయి. ఈ పరిస్థితిల్లో వరి పండించడానికి రైతులు ఆసక్తి చూపుతూ ముందుకు వెళుతున్నారు. వీరితో పాటు పాడి రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన కలిగిస్తున్న యూరియా కొరత

ఇదిలా వుండగా ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని, వరి పంటకు ఎక్కువగా యూరియా, డిఎపి వాడుతామని మార్కెట్లో కూడా ఎక్కడా యూరియా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి యూరియా, డిఏపీలు సరఫరా చేస్తే వరి రైతులకు అనుకూలంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం దగ్గర్లో ఉన్న కర్నాటక ములభాగలు, నంగిలి ప్రాంతాలలో ఎరువులు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నామని రైతులు తెలిపారు. వారం రోజుల క్రితం పశువులు మేయడానికి ఎక్కడా పశుగ్రాస లేకపోవడంతో గడ్డిని కొనుక్కొని ఆహారం అందించామని ప్రస్తుతం వర్షం పడటంతో పచ్చి గడ్డి వస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు

హై రోడ్డు విస్తరణ వేగవంతం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో హైరోడ్డు విస్తరణ పనులు వేగవంతమయ్యాయి. ఇందులో భాగంగా కట్టమంచి వద్ద ఉన్న ప్రైవేటు స్థలం , ప్రహరీ గోడ భవనం, భవన యజమాని అంగీకారంతో హై రోడ్డుకు కావలసిన వంద అడుగుల స్థలాన్ని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లాన్ సూపరువైజరు, టీబీపీవోలు, ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న మదర్ థెరిసా విద్యా సంస్థ విద్యార్థులు

ఘనంగా ఎంసీఏ కళాశాల గ్రాడ్యుయేషన్‌డే

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని మదర్ థెరిసా విద్యా సంస్థల్లో చదువుతున్న ఎంసీఏ విద్యార్థులు 2023- 2025 సంవత్సరంలో తమ కోర్సును పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం కళాశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు మెమెంటోలు అందజేసి భవిష్యత్తు కార్యాచరణ గురించి విద్యార్థులు తెలుసు కోవలసిన జాగ్రత్తలను తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా తమకు విద్యను నేర్పిన అధ్యాపకులకు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు మొత్తం 115 మంది ఉండగా 105 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినందుకు గురువులకు యాజమాన్యానికి ఎప్పుడు రుణపడి ఉంటామని కళాశాలకు తమ తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల యాజమాన్యం అకాడమిక్ అధికారి రాజేందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో

ఉపాధ్యాయులకు అవగాహన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తమ విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు విద్యాశాఖ అధికారుల ఆదేశం మేరకు మండల జెడ్‌పి హైస్కూలు బాలికల, బాలుర పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్ సమావేశం శనివారం నిర్వహించారు. ఇందులో పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్ , విద్యార్థుల ఫార్మేటివ్ అసెస్మెంట్‌కు సంబంధించిన విషయాలను, అధునాతన సబ్జెక్టు పరిజ్ఞానాన్ని గురించి తెలుసుకుంటారని బాలికల, బాలుర జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దేశమ్మ, మంచాలమ్మ తెలిపారు.

సోమల: మండలంలోని సోమల కందురు పెద్ద ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సి ఆర్ సి సమావేశాలను సి ఆర్ సి ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. అనంతరం టీచర్ హ్యాండ్ బుక్స్ పాఠశాల వారీగా ఉపాధ్యాయులకు పంపిణీ చేసినట్టు ఎంఈఓ శివరాత్నమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదమరి: ఉపాధ్యాయులకు క్లస్టర్ స్థాయి శిక్షణ సమావేశాలను శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభించారు. మండలంలో విద్యాశాఖ, ఉపాధ్యాయులకి సంబంధించిన మూడు క్లస్టర్‌లలో ఎస్‌జిటి లకు, యస్ఎలకు , పీడీలకు శిక్షణ మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించారు. ఈశిక్షణ కోర్స్ డైరెక్టర్‌గా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఎపి లలిత, చంద్రశేఖర్, హేమలత వ్యవహరించారు. మండల విద్యాశాఖ అధికారులు రుక్మిణమ్మ, హెచ్ఎల్ఎన్ ప్రసాద్, వరిగపల్లె హెచ్‌యం రమాబాయి, క్లస్టర్ మీటింగ్ లను పర్యవేక్షించారు. ఉపాధ్యాయులకు హ్యాండ్ పుస్తకాలు అందించారు.

సీఆర్‌పీని సన్మానిస్తున్న దృశ్యం

సీఆర్‌పీకి సన్మానం

ప్రజాశక్తి - తవణంపల్లి: తవణంపల్లి మండలంలోని తొడతర సిఆర్‌సిలో గత13 సంవత్సరాలుగా సిఆర్‌పిగా విధులు నిర్వహిస్తున్న ధనంజయ, బదిలీపై గంగవరం మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా తవణంపల్లి మండల విద్యాశాఖ అధికారి హేమలత ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి లు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూలు నిర్మాణాలు వేగవంతం చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కుప్పం నియోజకవర్గంలో పరిధిలో 35 మోడల్ స్కూల్స్ నిర్మాణ పనులు ప్రారంభించి వంద రోజులలోపు పూర్తి చేయాలని కలెక్టర్ సమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం, కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో కుప్పం నియోజకవర్గానికి మంజూరైన మోడల్ స్కూల్స్ నిర్మాణ పనుల పురోగతిపై సమగ్ర శిక్ష ఏపీసీ, స్పెషల్ ఆఫీసర్లు, ఎంఈఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజక వర్గం పరిధిలోని 35 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నిర్మాణ పనులకు సంబంధించి కుప్పం మండలానికి సంబంధించి 10 పాఠశాలలను సమగ్ర శిక్ష ఏపీసీ, శాంతిపురం మండలంలోని 8, గుడిపల్లి మండలానికి సంబంధించి ఏడు పాఠశాలలను ఏపీఈడబ్ల్యుఐడీసీ, రామకుప్పం మండలానికి సంబంధించి 10 పాఠశాలల పనులను పంచాయతీరాజ్ ఎస్ఈ పర్యవేక్షించాలన్నారు. ప్రతి పాఠశాలలో ఐదు తరగతి గదులు, ఐదు గురు ఉపాధ్యాయు లు ఉండేలా చర్యలు చేపడుతామన్నారు. నిర్మాణ పనులకు రూ.10.36 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, పను లను ప్రారంభించి వంద రోజుల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. 35 పాఠశాలలకు కలిపి ఆరో ప్లాంట్, పాఠశాలకు సంబంధించిన తలుపులు, డెస్కులు వంటి సామగ్రి కొనుగోలుకు కడ పీడీ, సమగ్ర శిక్ష ఏపీసీలు చర్యలు చేపట్టాలని తెలిపారు. మంజూరైన ప్రతి మోడల్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభించి నిర్దేశ కాలం లోపు పూర్తి చేయాలని, 11 కాంపోనెంట్‌కు సంబంధించి నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. మంజూరైన నిర్మాణ పనుల వివరాలు, పనుల పురోగతి, నిర్మాణాలకు చేసిన ఖర్చుల వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని సమగ్ర శిక్ష ఏపీసీని ఆదేశించారు. మండలాలలో నిర్మాణాలు చేపట్టిన మోడల్ స్కూల్స్‌ను ఆయా మండలాల ఎంఈఓలు పరిశీలించి పనులను వేగవంతం చేయాలని నిర్మాణాలకు అవసరమైన మెటీరి యల్స్ కొనడానికి టెండర్స్ పిలవాలని తెలిపారు. నిర్మాణం పనుల్లో ప్రతి 25 శాతం పనులు పూర్తయిన వెంటనే పనులకు సంబంధించి ఎంబుక్కులను తయారుచేసి సమగ్ర శిక్ష ఏపీసీకి పంపాలని సూచించారు. అప్‌లోడ్ అయిన ప్రతి బిల్లుకు నగదు చెల్లించేలా చర్యలు చేపడు తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కడా పీడీ వికాస్ మర్మత్, డీఈఓ వరలక్ష్మి, పిఓ ఎస్ఎస్ఏ మద్దిపట్ల వెంకటరమణ, ఈఈ ఎస్ఎస్ఏ మధుసూదన్ రావు, ఏపీ ఈడబ్ల్యుఐడీసీ, పిఆర్ డిపార్టుమెంట్ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కరదీపికలు పంపిణీ

ప్రజాశక్తి -విజయపురం : మండలంలోని ఉపాధ్యాయులకు శనివారం కరదీపికలు ఎంఈవో పంపిణీ చేశారు. విజయపురం మండలంలోని 38, ప్రాథమిక 2 ప్రాథమికోన్నత, ఐదు ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు శనివారం, విజయపురం, పన్నూరులలో నిర్వహించిన సిఆర్‌సి సమావేశంలో కరదీపికలు అందించారు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయ కరదీపికలను మండల విద్యాశాఖ అధికారి హరిప్రసాద్ వర్మ అందించారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో కరదీపికలను ఉపయోగించి బోధన కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు సుమతి, దొరస్వామి, జానకిరామిరెడ్డి, సురేష్ కుమార్, వెంకమరాజు సిఆర్‌పిలు జానకిరామ్, హేమలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం

కృష్ణమనాయుడును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు నియోజకవర్గం గంగాధర నెల్లూరు మండలానికి చెందిన టిడిపి నేతలు పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమ నాయుడును పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా శనివారం చిత్తూరులో ఆయన నివాసంలో మాజీ పిహెచ్‌సి ఛైర్మన్ నరసింహులు నాయుడు, టిడిపి జీడీ నెల్లూరు నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ, బూత్ కన్వీనర్ కంద్రిగ శంకర్, పూల బొకే ఇచ్చి శాలువతో వారు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమ నాయుడును ఘనంగా సన్మానించారు.

సీఎంను కలిసిన ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: తిరుపతిలో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' లో భాగంగా పాల్గొనేందుకు రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కు ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వియం థామస్ సాదర స్వాగతం పలికి ఆహ్వానించారు.

బంగారుపాళ్యం: శనివారం తిరుపతి పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును టిడిపి మండల అధ్యక్షులు ధరణి ప్రసాద్ కలిసి బంగారుపాళ్యం మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామ స్థాయిలో టిడిపి బలోపేతానికి నాయకులందరూ పనిచేయాలన్నారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా రెడ్డెమ్మ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:

బైరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మొగశాల రెడ్డెమ్మ కృష్ణమూర్తికి రెండవ సారి వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా అధిష్టానం పట్టం కట్టింది. వారి ఎంపికను హర్షిస్తూ, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా వీరి ఎంపికపై చిత్తూరు జిల్లా సోషియల్ మీడియా సెక్రెటరీ బి దినేష్ శెట్టి, మండల వైస్ ఎంపీపీ నారాయణస్వామి శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య విద్యలో నైతిక విలువలు అత్యవసరం

- ఎథిక్స్ వర్క్‌షాప్‌లో వైస్ ఛాన్సలర్ డాక్టరు హెచ్ వినోద్ భట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వైద్య వృత్తిలో నైతిక విలువలు అత్యంత అవసరమని అపోలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టరు హెచ్ వినోద్ భట్ అన్నారు. మెడికల్ పీజీ విద్యార్థులు, అధ్యాపకుల కోసం శనివారం చిత్తూరులో అపోలో వైద్య విజ్ఞాన పరిశోధన సంస్థ (ఎఐఎంఎస్ఆర్) నిర్వహించిన 'ఎథిక్స్ వర్క్‌షాప్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్ అపోలో హాస్పిటల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ఫౌండేషన్ (ఎహెచ్ఇఆర్ఎఫ్) , ఇండియన్ సొసైటీ ఫర్ క్లినికల్ రీసర్చ్ (ఐఎస్‌సిఆర్) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు వినోద్ భట్ మాట్లాడుతూ 'ఎథిక్స్, మోరల్, లీగల్ అంశాలు ఒకదాని కొకటి అనుసంధానమై ఉంటాయి. వైద్య వృత్తిలో నైతికతకు ఎంతో ప్రాధాన్యత వుంది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే నిజమైన వైద్యుని బాధ్యత' అని పేర్కొన్నారు. ప్రముఖ రీసోర్స్ పర్సన్లుగా మంగళూరు కస్తూరిబ మెడికల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అనిమేష్ జైన్, ప్రొఫెసర్ అశోక్ షెనాయ్ హాజరై, వైద్య రంగంలో నైతికత ప్రాధాన్యతపై విలువైన సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో అపోలో వైద్య విజ్ఞాన పరిశోధన సంస్థ డీన్ డాక్టరు ఆల్ఫ్రెడ్ జె అగస్టిన్, జీఎం వినోద్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఉషా అడిగ, ఫార్మకాలజీ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ సచ్చిదానంద అడిగ, పీజీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్‌ఛాన్సలర్ డాక్టరు హెచ్ వినోద్ భట్

సమాచారం ఇచ్చి విజిలెన్స్ సమావేశం నిర్వహించాలి

ఎస్‌సి, ఎస్‌టి నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎస్‌సి, ఎస్‌టి ముఖ్య నాయకులకు సర్క్యులర్ ద్వారా సమాచారమిచ్చి ఆర్డీవో కార్యాలయంలో జరిగే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలకు రప్పించి సమావేశం నిర్వహించాలని ఎస్‌సి, ఎస్‌టి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పలమనేరు పట్టణంలోని మానవ హక్కుల కార్యాలయంలో ఎస్సీ నాయకులు నిర్వహించిన సమావేశంలో డివి మునిరత్నం మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న జీవోలను అమలు చేయాల్సిన అధికారులు గుట్టు చప్పుడు కాకుండా ఒకరినో ఇద్దరినో పిలుచుకుని సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. జులై 18వ తేదీ పలమనేరు ఆర్డిఓ కార్యాలయంలో నిర్వహించిన విజిలెన్స్ సమావేశానికి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ముఖ్యమైన దళిత నాయకులకు సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడం చూస్తుంటే దళితుల మనోభావాలు దెబ్బతీసి ప్రశ్నించే దళిత నాయకులు గొంతు నొక్కే విధంగా ఉందన్నారు. నిత్యం ఎస్‌సి, ఎస్‌టి సమస్యలపై పోరాడుతూ సమస్యలు పరిష్కారానికి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చించాలని ప్రయత్నిస్తున్న వారు అనేకమంది ఉన్నారనే విషయం సబ్ డివిజనల్ అధికారి తెలుసుకో వాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల మేరకు ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలు మండల స్థాయిలో జరగ కుండా పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయని గుర్తు చేశారు. మండల అధికారులు కూడా ఎస్సీ, ఎస్‌టి జీవోలను సైతం అమలు పరచకుండా బాధ్యత రాహిత్యంగా వ్యవహరించడంతో ఎస్సీ ,ఎస్టీలు, మహిళలు, చిన్నారులపై విపరీతమైన దాడులు హత్యలు, అత్యాచారాలు జరుగు తున్నాయని వీటన్నిటికీ ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులే కారణమన్నారు. డివిజన్ కార్యదర్శి మణి మాట్లాడుతూ ఇప్పటికైనా పలమనేరుతో పాటు జిల్లాలో ఉన్న రెవెన్యూ డివిజనల్ అధికారులు ఆయా మండలాల్లో ఉన్న ముఖ్యమైన ఎస్‌సి, ఎస్‌టి నాయకులను సర్క్యులర్ ద్వారా సమాచారమిచ్చి సమావేశాల్లో నాయకులు ప్రతిపాదించిన సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

మహిళలను కించపరచడం అన్యాయం

- కొవ్వొత్తులతో మహిళల నిరసన
- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : మహిళను కించపరచడం దేశ సంస్కృతిని కించపరచడమే అని వైసిపి మహిళా నేతలు పేర్కొన్నారు. మాజీ మంత్రి ఆర్కేరోజానుద్దేశించి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన నీచపు వ్యాఖ్యలను ఖండిస్తూ వారు శనివారం వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి ఆర్‌కె రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమన్నారు. దుష్ట సంస్కృతికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయన్నారు. ఎమ్మెల్యేపై ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. లేకుంటే నిరసనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షులు అముద, మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, కౌన్సిలర్లు చినపాప, సాయిసంధ్యారాణి, రూరల్ మండల మహిళా అధ్యక్షురాలు మాబూనిషా, మున్సిపల్ మహిళా కార్యదర్శి తేన్‌మొళి, మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, పట్టణ పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, రూరల్ పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎపిపిటిడి జిల్లా గౌరవాధ్యక్షులుగా గురజాల చెన్నకేశవ నాయుడు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పిపిపిటిడి కార్మిక పరిషత్ చిత్తూరు జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు తో పాటుగా ప్రత్యేక ఆహ్వానితులుగా చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు మాధవనాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశం లో కార్మికపరిషత్ చిత్తూరు జిల్లా గౌరవాధ్యక్షులుగా గురజాల చెన్నకేశవ నాయుడుని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చెన్నకేశవ నాయుడు మాట్లాడుతూ కార్మికపరిషత్‌కు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

వీధి విక్రయదారుల జీవనోపాధికి రక్షణ: కమిషనర్

ప్రజాశక్తి -పలమనేరు: వీధి విక్రయదారుల జీవనోపాధికి రక్షణ కల్పిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. పలమనేరు పురపాలక సంఘ కార్యాలయంలో రమణా రెడ్డి, మునిసిపల్ కమిషనర్ అధ్యక్షతన వీధి విక్రయదారుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధి విక్రయదారులను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారుల జీవనోపాధి రక్షణ, విక్రయాల నియంత్రణా చట్టాలకు అనుగుణంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా వ్యాపార నిర్వహణకు పట్టణంలో బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీధి విక్రయదారులు వారి వ్యాపార పెట్టుబడి కోసం బయట అధిక వడ్డీలకు పోకుండా వారి కోసమే అమలు చేస్తున్న స్వానిధి, ముద్ర రుణాలను బ్యాంకు నుండి తీసుకోవాలని సూచించారు. అతి తక్కువ ప్రీమియం తో వీరి సాంఘిక రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జనశ్రీ బీమా యోజన సురక్ష బీమా యోజనలో అతి తక్కువ ప్రీమియం తో బీమా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ మొహిద్దీన్, మునిసిపల్ మేనేజర్, మహిళా సంఘ సభ్యులు, ఇండియన్ బ్యాంకు మేనేజర్ అశోక్ కుమార్ , సబ్‌ఇన్‌స్పెక్టర్ లోకేష్ రెడ్డి , సిఐటియు జిల్లా కార్యదర్శి గిరిధర్ గుప్తా పాల్గొన్నారు

మృతదేహానికి పూలమాల వేస్తున్న అనిల్

వేణుగోపాల్ గౌడుకు నివాళులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలం లోని పాత పంచాయతీ పరిధిలోని కుప్పనపల్లి గ్రామంలో వేణుగోపాల్ గౌడ్ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న కడప రక్తం గ్రామం సమీపాన వెలసిన నల్గొండ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు వేణుగోపాల్ గౌడ్ గత 30 సంవత్సరాలుగా ఆయన చేసిన కృషిని గుర్తు తెచ్చుకుని ఆయన మరణించడం చాలా బాధాకరమని ఆయనలోని లోటు ఎవరూ భర్తీ చేయలేరని ఆయన్ని ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రెటరీ బిజె అనిల్, మండల కాంగ్రెస్ నాయకులు ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి వెంట స్థానిక సర్పంచ్ మమతా రవిచంద్రన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాల్ రాజ్‌కు..

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని జీడి నెల్లూరు దళిత వాడకు చెందిన పాల్ రాజ్ (60) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా శనివారం గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చి పాల్ రాజ్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల వైస్ ఎంపీపీ హరిబాబు, పలువురు నాయకులు నివాళులర్పించారు.

సుపరిపాలకు తొలి అడుగు

ప్రజాశక్తి - పులిచర్ల: పులిచర్ల మండలం ఎల్లంకి వారి పల్లి గ్రామం, దిగువమూర్తి వారి పలిలో సుపరిపాలనకు తొలి అడుగు - ఇంటింటికి మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి చల్లా రామచంద్రరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

రామకుప్పం: మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ సర్పంచ్ సీతాపతి శనివారం సుపరిపాలన కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి రవి రెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప, నేతల టీవీ రవి, బాలు, సుబ్రి, ఆదిల్, చాంద్ భాషా పాల్గొన్నారు.

రామకుప్పంలో

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE :: SRIKALAHASTHI
O.S. No. 1 of 2023
Srikalahasteeswara Swamy Devasthanams rep. by is E.O-Cum Special Grade Deputy Collector, Srikalahasthi ...*Plaintiff*
Vs.
Surneni Parthasaradhi and others ...**Defendants**
SUMMONS TO DEFENDANT No.18
DEFENDANT No. 18
T. Deepthi, D/o T. Raja Sekhar W/o K.Abilash, D.No.14-400/1, North Palance Road, Kuppam, Chittoor District.
Please take summons that the plaintiff Devasthanam has filed the above suit seeking declaration of title and other reliefs the matter is posted to 25-07-2025 for your appearance in person through counsel at 10.30 am in the above court As otherwise the matter will be decided expate.
Date of Hearing :25-07-2025
By order of the court
S. ADINARAYANA, B.Com., B.L.
ADVOCATE, TIRUPATI. **Cell:9440631284**

ప్రకటన
ఇందుమూలంగా తెరియజేయుడం ఏమనగా కె. ఆయేష భర్త, కె.షబ్జీర్ భాషా 20-131 బజారు వీధి, పలమనేరు. టౌన్లో నివాసం వుంటున్నారు. కె.ఆయేష ఇంటి నుండి బయలదేరి జవిళివీధిలో వున్న అంబికా జిరాక్స్ సెంటరు దెగ్గరకు జిరాక్స్ జిరాక్స్ చేసుకొనుటకు వెళ్ళినప్పుడు అక్కడ పత్రం ఎక్కడో దారి పోయింది. పలమనేరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు తన పేరునకు రిజిస్టరు కాబడియుండు దస్తావేజు నెం. 1416/2016 ఒరిజినల్ దస్తావేజు పోగొట్టుకున్నారు. అని మీ సేవ ద్వారా No. MLD 012500542764 గా పలమనేరు పోలీసు వారికి ఫిర్యాదు చేసినాడు. ఆదస్తావేజు వారు పోగొట్టుకున్న ప్రదేశంలో పరిశీలించగా దొరకలేదు. కావున సదరు దస్తావేజు నకలును సంబందిత పలమనేరు SRO వారి నుండి పొందవలసిందిగా సూచించడమైనది.
S.K. Sreeram Samarth, B.Com., LLB.,
Advocate
Cell: 7680048210

ప్లాస్టిక్ రహిత నగరంగా చిత్తూరు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్లాస్టిక్ రహిత సుందర నగరంగా చిత్తూరును అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'లో భాగంగా శనివారం కొంగారెడ్డిపల్లిలో 'స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన' అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వస్త్రాలతో చేసిన బ్యాగులను పంపిణీ చేశారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టరు పి లోకేష్, సీఎంఎం వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛం ఆంధ్రలో భాగంగా శనివారం ఎస్‌పి మణికంత చందోలు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయం, ఏఆర్ కార్యాలయం, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్‌లో అధికారులు, సిబ్బంది ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్ ఏఆర్‌డిఎస్పీ చిన్ని కృష్ణ, మహబూబ్ బాష, ఆర్ఐ సుధాకర్‌తో కలిసి ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు.

కార్వేటినగరం: పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. శనివారం మండల కార్యాలయం ఆవరణలో స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతమైన సమాజానికి దోహద పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సిబ్బందితో కలసి పిచ్చిమొక్కలను తొలగించి పలసాయ మొక్కలను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఏవో విద్యావతి, కార్యాలయ ఆవరణంలో డిప్యూటీ ఎంపీడీవో మధుసూధన్, పంచాయతీ ఈవో నాగరత్నమ్మ, కార్యదర్శి సెల్వి, ఏపీఎం కవిత పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర'లో భాగంగా డాక్టర్ వైయస్సార్ కళాశాలలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కళాశాల ఆవరణలో, చుట్టుపక్కల పరిసరాలలో వ్యర్థ ప్లాస్టిక్‌ను ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సి మంగళ గౌరీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో సేకరించి నిర్మూలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద, రసాయన విభాగం అధ్యాపకులు డాక్టర్ వి ప్రభాకర్‌రావు క్షుణ్ణంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లి: తవణంపల్లె మండలంలోని జెడ్పీహెచ్ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై 75 మొక్కలు నాటారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ నిర్మూలన కోసం చైతన్యాన్ని కలిగించడం లక్ష్యంగా కార్యక్రమం కొనసాగింది. ముఖ్య అతిథులుగా సర్పంచ్ చిట్టెమ్మ, ఎంపిడివో హరి ప్రసాద్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని ఆనిగనూరు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర పై ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రత, పరిరక్షణకు అలవాటు పడాలన్నారు. విద్యార్థులచేత స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర నినాదాలు చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామ్మూర్తి, పిఎంసి ఛైర్మన్ బీరప్ప, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం : కుప్పం పట్టణం మోడ్రన్ కాలనీలో ఉర్దూ పాఠశాల నిర్మాణ స్థలాన్ని స్థానిక టిడిపి నాయకులు శనివారం శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా 11వ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, స్థానిక యూనిట్ ఇన్చార్జ్ నభి, ఈ కార్యక్రమంలో 9వ వార్డు అధ్యక్షులు అల్లాబకాష్, బూత్ కన్వీనర్ గని పాల్గొన్నారు.



రామకుప్పంలో



బైరెడ్డిపల్లి లో

బైరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని పుంగనూరురక్షడ్‌లోని శనివారం సంతలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర ప్లాస్టిక్ కాలుష్యం నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భాగంగా అక్కడికి వచ్చిన వారందరి వద్ద ప్రతిజ్ఞ చేయించి ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని స్థానిక ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పరశురాముడు, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, మహిళా పోలీసులు, పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని అన్ని పాఠశాలలో సచివాలయాల పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణానంద కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులు అధికారులు సచివాలయ సిబ్బంది ప్లాస్టిక్ ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు.